


**చెస్ క్వీన్ దివ్య**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త
JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -127 మంగళవారం 29 జులై 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# రాష్ట్రపతిని కలుద్దాం

## 6న జంతర్ మంతర్ వద్ద ప్రజా ప్రతినిధుల ధర్నా

- ఆగస్టు 5న పార్లమెంటులో వాయిదా తీర్మానాలు
- ఏడో తేదీన 200 మంది నాయకులతో రాష్ట్రపతి వద్దకు
- బీసీ రిజర్వేషన్ బిల్లులను వెంటనే ఆమోదించాలని వినతి
- కార్యాచరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- బీజేపీ బీసీ ఎంపీలూ బిల్లుల ఆమోదానికి సహకరించండి
- అసెంబ్లీలో మద్దతిచ్చి.. ఢిల్లీలో మోకాలడ్డుతున్న బీజేపీ
- ఆమోదించినప్పుడు పరిమితి గురించి తెలియదా!?
- మీడియాతో మంత్రులు పొన్నం, వాకిటి, కొండా సురేఖ
- ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు






హైదరాబాద్, **జులై28(జర్నలిస్ట్ వార్త)::** బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో ఆగస్టు 6న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆగస్టు ఏడో తేదీన ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి సహా లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత, రాజ్యసభ పక్షనేత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరతారు. మిగతాది 2లో...

# ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

- మన సైనిక సత్తాను ప్రపంచమంతా గుర్తించింది
- ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఉగ్రమూకలపై దాడి
- పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం
- మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం
- లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ,**జులై28(జర్నలిస్ట్ వార్త):**ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.మిగతాది 2లో...



# ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదు


- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన
- ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఏపీ ప్రభుత్వం తెలిపిందన్న కేంద్రం
- రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్న
- లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర జల్ శక్తి శాఖ

పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది.మిగతాది 2లో...

# 'ఆపరేషన్ మహదేవ్'..

## ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన భారత సైన్యం

- ధృవీకరించిన ఆలిండియా రేడియో వెబ్‌సైట్
- నెల రోజుల నుంచి ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల గాలింపు
- పకడ్బందీ ప్రణాళికతో ముగ్గురిని మట్టుబెట్టిన భద్రతా బలగాలు





శ్రీనగర్,**జులై28(జర్నలిస్ట్ వార్త):**జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకుమైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది.మిగతాది 2లో...





# కొనసాగుతున్న 'సృష్టి' దర్యాప్తు


- కూకట్‌పల్లి, కొండాపూర్ బ్రాంచీల నుంచి ఫైల్స్ స్వాధీనం
- ఐవీఎఫ్, సరోగసీ ద్వారా సంతానం పొందిన వారి వివరాలు సేకరణ
- అందుబాటులోకి రాని దంపతులు
- సుమోటోగా స్వీకరించి విచారణకు హెచ్‌ఆర్సీ ఆదేశం

# గిన్నిస్ బుక్ లో ఎక్కిన 'మెగా పీటీఎం'...

- టీచర్లకు అంకితం ఇచ్చిన మంత్రి నారా లోకేశ్
- 53.4 లక్షల పేరెంట్స్, టీచర్స్ పాల్గొన్న అతిపెద్ద పీటీఎంగా రికార్డ్
- విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో కలిపి మొత్తం 1.5 కోట్ల మంది హాజరు
- గిన్నిస్ రికార్డ్ సాధనలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్



# తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు



హైదరాబాద్,**జులై28(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త జడ్జిలు రానున్నారు. దేశవ్యాప్తంగా పలు హైకోర్టులకు సోమవారం 19మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. కాగా, 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమించారు. గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. తెలంగాణతోపాటు- మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు.. ఇక, అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమితులయ్యారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.2 లక్షల రుణం

- డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణ సదుపాయం
- ఇప్పటికే కొన్ని జిల్లాల్లో మంజూరైన రుణాలు
- నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్ల మంజూరు



# కొనసాగుతున్న ‘సృష్టి’ దర్యాప్తు

**హైదరాబాద్,జులై28(జర్నలిస్ట్ వార్త):** సికింద్రాబాద్‌లోని ‘సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్’ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆస్పత్రి నుంచి భారీ సంఖ్యలో ఫైల్స్ సేకరించారు. గతంలో ఐవీఎఫ్‌తోపాటు సరోగసీ పద్ధతిలో సంతానం పొందిన దంపతుల వివరాలు కూడా సేకరించారు. అయితే కొంత మంది స్పందించకపోవడం, ఫోన్ ఎత్తకపోవడం, ఫోన్ కట్ చేయడం, స్విచ్ఛాఫ్ చేయడం వంటి సమస్యలు వారి నుంచి ఎదురైనట్టు పోలీసులు తెలిపారు. నాలుగు రోజులుగా ‘సృష్టి’ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో భయంతో దంపతులు ఫోన్ కాల్స్‌కు అందుబాటులోకి రాలేదని తెలిసింది. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కి సంబంధించి రంగారెడ్డి జిల్లా కొండాపూర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో కూడా బ్రాంచీలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడ కూడా వివరాలు సేకరిస్తున్నారు.

**‘గాంధీ’ పాత్రపై ఆరా..!**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు కొందరు ప్రయివేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులతో కుమ్మక్కవుతున్నట్టు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు ఉచితంగా అందించాల్సిన దాదాపు రూ.2లక్షల విలువైన మందులను 2023లో వారాసిగూడలోని ఓ ప్రయివేటు మెడికల్ షాపులో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సర్కార్ మందులు లభ్యం కావడం.. దగ్గరలో ఉన్న గాంధీ ఆస్పత్రి నుంచే సరఫరా అయినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ మెడికల్ షాపునకు ఆ మందులను ఎవరు సరఫరా చేశారనే విషయాలపై అప్పట్లో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దర్యాప్తు చేపట్టినా.. వివరాలను బయటికి వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. ఇప్పుడు సరోగసీ వ్యవహారంలో మరోసారి గాంధీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ఉండటంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో అరెస్టు చేసిన 8 మంది నిందితుల్లో గాంధీ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్గుల సదానందం కూడా ఉన్నారు. డాక్టర్ నమ్రతతో కలిసి ఆయన కూడా ఈ వ్యవహారంలో పాలు పంచుకున్నట్టు తేలడంతో సదానందంను 14 రోజులు రిమాండ్‌కు పంపారు. ఆయన పాత్రపై పోలీసులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ అధికారి అయ్యి ఉండి, ప్రయివేటు ఆస్పత్రికి సహాయ సహకారాలు అందించడం వెనుక ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**హెచ్ఆర్సీ ఆగ్రహం.. విచారణకు ఆదేశం**

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో చేపట్టిన అక్రమ సరోగసీ, శిశువుల విక్రయం పట్ల రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వివాహమై ఏండ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టని దంపతులను ఈ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నమ్రత మోసం చేయడాన్ని హెచ్ఆర్సీ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు నవతెలంగాణతోపాటు ఇతర మీడియాలో ప్రచురితమైన కథనాలకు హెచ్ఆర్సీ చైర్మెన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ స్పందించి కేసును సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీలోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చట్టవిరుద్ధమైన, అనైతికమైన పద్ధతులను సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత ఎంచుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**: ఎమ్మెల్యే హరీశ్‌రావు**

మెదక్ **జులై28(జర్నలిస్ట్ వార్త):** సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందడానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని, మృతుల కుటుంబాలకు వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.

దారుణమైన ప్రమాదం జరిగి అనేక మంది మరణించగా, ఇంకొందరు తీవ్రంగా గాయాలపాలైన ఘటన జరిగిన తర్వాత కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాగలేదన్నారు. కంపెనీ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం నుంచి 15 రోజుల్లో అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చి నెల




రోజులైనా ఎందుకు డబ్బులు ఇప్పించలేదని ప్రశ్నించారు. తీవ్రంగా గాయపడ్డ కార్మికులకు రూ.50 లక్షలు, తక్కువ గాయాలైన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు సంగారెడ్డికి వచ్చి వెళ్లాలంటే రూ.20 వేల ఖర్చు అవుతున్నందున చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చనిపోయిన వారి పేర్లు, ఎవరెవరికి ఎంత సాయం చేశారో.. గాయపడిన వారికి ఎంత ఇచ్చారనే వివరాల్ని ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతుందని ప్రశ్నించారు. యాజమాన్యం పూర్తి నిర్లక్షంగా వ్యవహరించిందని ఫిర్యాదు చేసినా ఎందుకని యాజమాన్యాన్ని రేవంత్‌రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. కంపెనీతో ఉన్న లాలూచీ ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మృతదేహాలు ఇవ్వకుండా 8 మంది మిస్సింగ్ అంటూ ఎందుకు వేధిస్తున్నారన్నారు. వారికి వెంటనే డెత్ సర్టిఫికెట్స్ ఇచ్చి ఆ కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. 54 మంది కార్మికులు చనిపోతే ఎందుకు యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి 150 రోజులైనా శవాలు దొరకలేదని, సిగాచిలోనూ 8 మంది శవాలు ఇంత వరకు లభించలేదని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే జైలుకు పంపే ప్రభుత్వం.. ఎంతో మంది కార్మికుల్ని బలితీసుకున్న సిగాచి యాజమాన్యాన్ని ఎందకు అరెస్టు చేసి జైలుకు పంపట్లేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

(మొదటి పేజి తరువాయి)

ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకంగా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు–బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టు–బెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు.మే 10వ తేదీన సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు–, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్–400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకు పడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు



ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ ప్రసంగిస్తున్న సేపు అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలన్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయీ ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయీ లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయీ చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయీ తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# గిన్నిస్ బుక్ లో ఎక్కిన ‘మెగా పీటీఎం’...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్–టీచర్ మీటింగ్ నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పిందని, ఈ గిన్నిస్ రికార్డు ఉపాధ్యాయులకు అంకితం అని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 5.34 మిలియన్ల (53.4 లక్షలు) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (%SMC%) సభ్యులు, ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారితో సహా మొత్తం 15.2 మిలియన్ల (1.5 కోట్లు) మంది ఈ అతిపెద్ద పేరెంట్–టీచర్ మీటింగులో భాగమయ్యారు.జాతీయ విద్యా విధానం ఐదవ వార్షికోత్సవం జూలై 29కి ఒక రోజు ముందు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ గిన్నిస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మెగా పీటీఎంని విజయవంతం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఈ అరుదైన రికార్డు సాధనలో భాగమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా వికాసానికి, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాశాఖ చేస్తున్న కృషిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించడం హర్షనీయమన్నారు.

(మొదటి పేజి తరువాయి)

# కలిసి నిర్మిద్దాం రండి

అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు– పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు క్షేత్ర స్థాయి పర్యటనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. సోమవారం సింగపూర్‌లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ– ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు– సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. కొత్త ఆలోచనలతో, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు అన్నారు.

# ‘ఆపరేషన్ మహదేవ్’..

ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు– సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ – లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ‘ఆపరేషన్ మహదేవ్‘ పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు–పెట్టినట్లు– తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు– నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ ’ది రెసిస్టెన్స్ ఫ్రంట్’కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు– ప్రాథమికంగా నిర్ధరించారు.

# రాష్ట్రపతిని కలుద్దాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. నాలుగున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించారు.అనంతరం మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. “రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుటుంబాలవారీగా సర్వే చేశాం. సర్వే నివేదికను సబ్ కమిటీ ద్వారా పరిశీలింపజేశాం. ఏడాదిలోపులోనే క్యాబినెట్ కూడా దానిని ఆమోదించింది. ఆ తర్వాత మార్చిలో.. స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను అన్ని పార్టీల సహకారంతో శాసనసభలో ఆమోదించాం. వాటిని మార్చి 22న గవర్నర్ ఆమోదం కోసం పంపాం. మార్చి 30న గవర్నర్ వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. అదే సమయంలో, పంచాయతీరాజ్ చట్టంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ ఈనెల 10న ఆర్డినెన్స్‌ను తయారు చేసి, 14న గవర్నర్‌కు పంపించాం. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపినందున.. ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించాల్సిందిగా గవర్నర్‌కు విజ్ఞప్తి చేశాం. దీనిని కూడా ఆయన రాష్ట్రపతికి పంపించినట్లు మాకు సమాచారముంది. తప్పకుండా సానుకూల నిర్ణయం వస్తుందని వేచి చూస్తున్నాం” అని పొన్నం ప్రభాకర్ వివరించారు. అందుకే మూడు రోజులపాటు ఢిల్లీలో ఉండి, రాష్ట్రపతిని కలవాలని క్యాబినెట్‌లో నిర్ణయించామని తెలిపారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు, పార్టీకి చెందిన 100 మంది ఎంపీలం రాష్ట్రపతిని కలవాలనుకుంటున్నామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులందరం ఢిల్లీకి వెళుతున్నామని, బీసీ మేధావులు, బీసీ నాయకులు, కుల సంఘాల నాయకులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. 42% రిజర్వేషన్లు ఆశించే ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు రూ.2 లక్షల రుణం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ‘ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం’ లబ్ధిదారులకు మరో శుభవార్త.. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిరుపేదలకు గూడు కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఈ రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో లబ్ధిదారులకు రుణం మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4,16,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. లబ్ధిదారులకు అందించాల్సిన రూ.5 లక్షలను విడతల వారీగా విడుదల చేస్తోంది. పునాది వరకు నిర్మిస్తేనే తొలి విడత సాయంగా రూ.లక్ష జమ చేస్తోంది. అయితే, ఈ పథకానికి ఎంపికైనప్పటికీ పునాది నిర్మించుకునేందుకు ఆర్థిక వెసులుబాటు లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అలాంటి కుటుంబాలకు చెందిన మహిళలు స్వయం సహాయక గ్రూపుల్లో సభ్యులుగా ఉంటే రుణం అందజేస్తోంది.

# ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదు

సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
మంగళవారం 29 జూలై 2025

## ఘనంగా సోమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవము




**ధర్మసాగర్/జూలై26 (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని రాయగూడెంలో నెలకొల్పబడిన శ్రీ సరస్వతీ మాత సోమలింగేశ్వర స్వామి దేవస్థానం లో మొదటి శ్రావణ సోమవారం సందర్భంగా సోమలింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కళ్యాణ మహోత్సవము పూజా కార్యక్రమాలతో అంగరంగ వైభవముగా జరిగింది వ్యవస్థాపకులు రామగిరి సోమలింగ ఆచార్య సోమలక్ష్మి సోమవారం మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాల్సిందిగా కోరుకుంటున్నాము కళ్యాణ మహోత్సవమును తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ స్వామి యొక్క ఆశీస్సులు పొందుతారని అన్నారు కళ్యాణం లో భక్తులు పంచ కండువా సాంప్రదాయ దుస్తువులలో కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు

## గెస్టు టీచర్ నియామాకానికి దరఖాస్తులు ఆహ్వానం.




**వేలేరు/జులై29(జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండలంలోని కస్తూర్బగాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) జూనియర్ కళాశాలలో ప్రస్తుత సంవత్సరానికి జువాలజీ సబ్జెక్టు బోధించుటకు గెస్టు టీచర్ నియామానికి ఎంఎస్ సి, జువాలజీ, బిఇడి చదివిన మహిళా అభ్యర్థులు ఈనెల 29/07/2025.సాయంత్రం 5 గంటలవరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల స్పెషల్ ఆఫీసర్ కె స్రవంతి ఒకప్రకటనలో కోరారు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈక్రింది ఫోన్ నెంబరు 6302494148 ను సంప్రదించగలరు.

## పరిసరాల పరిశుభ్రతపై సభర్మతి పాఠశాల విద్యార్థులకు అవగాహన.



**వేలేరు/జులై28(జర్నలిస్ట్ వార్త ):**వేలేరు మండలకేంద్రంలోని సబర్మతి పాఠశాలలో వేలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెచ్ఐఒ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్ కుమారస్వామి విద్యార్థులకు వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ గొట్టెముక్కుల పద్మావతి, అధ్యక్షతన నిర్వహించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం సంధర్భంగా సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నందున విద్యార్థులు తమ ఇండ్ల చుట్టుప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలని కోరారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టెముక్కుల సూరేష్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ .




**ధర్మసాగర్/జూలై 28(జర్నలిస్ట్ వార్త):** భారతరత్న, భారత మిస్సైల్ మాన్ గా పిలువబడే డాక్టర్ అబ్దుల్ కలాం పదవ వర్ధంతిని పురస్కరించుకొని "నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ" అనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు విభజిత జిల్లాల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, అందులో ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ఇదే అంశాల ఫాతిమా నగర్ లోని బాలవికాస కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొన్నారు .ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పదో వర్ధంతి సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ధర్మ ప్రకాష్ అధ్యక్షతన" భారత దేశ ప్రగతికి అబ్దుల్ కలాం విజన్" అను అంశాల నిర్వహించిన సదస్సులో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత ,పద్మజ, ప్రసన్న ,రమ్యశ్రీ, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ ఆడుతూ కుప్పకూలిన యువకుడు..గుండ్ల రాకేష్

**తల్లాడ/జులై28(జర్నలిస్ట్ వార్త):** ఆటలాడితే, ఆరోగ్యంగా ఉంటామని అందరం అనుకుంటున్నాం. కానీ రెగ్యులర్‌గా షటిల్ ఆడుతున్నా ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన 25 ఏళ్ల రాకేష్, మృత్యువు నుంచి తనను తాను కాపాడుకోలేకపోయాడు. సోమవారం హైదరాబాద్ నాగోల్‌లో ఈ జరగరాని ఘోరం జరిగింది, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఎలక్ట్రానిక్ కార్ షోరూమ్‌లో రాకేష్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతడికి రోజూ షటిల్ ఆడే అలవాటు ఉంది. అలవాటు ప్రకారం, హైదరాబాదులోని నాగోల్ స్టేడియంలో స్నేహితులతో కలిసి షటిల్ ఆడుతుండగా, గుండె పోటు వచ్చింది. దీంతో ఒక్కసారిగా కుప్పకూలాడు



ఏం జరిగిందో తెలియక తోటి స్నేహితులు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి లేపే ప్రయత్నం చేశారు.అప్పటికే అతను స్పృహ కోల్పోయాడు వెంటనే



హుటాహుటిన స్నేహితులు దగ్గర్లో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

## రహదారుల పక్కన ఏపుగా పిచ్చిమొక్కలు..

# ప్రయాణం సాగేదెల...



**సత్తుపల్లి/జూలై28(జర్నలిస్ట్ వార్త):** జాతీయ రహదారుల తో పాటు గ్రామీణ రహదారులు నిర్వహణ లోపం తో ప్రభుత్వాన్ని అధికారులు అభాసుపాలు చేస్తున్నారు. మండలం లో ఏ గ్రామంలో చూసిన రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లు కుచించుకుపోయి ప్రయాణానికి ఆటంకం గా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు సైడ్ గొయ్యి ఉందో ఇంకేం ఉందో అర్థం కాక ఎదురుగా వాహనాలు వస్తె సైడ్ తప్పుకోవడానికి నానా రకాల ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు.నారాయణపురం - గురుపట్లగూడెం, తుంబూరు - భీమవరం రోడ్డు ఇలా చెప్పుకుంటూపోతే మండలం లో చాలా ఉన్నాయని, వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కిష్టారం- చెరుకుపల్లి రహదారి మీద గోతులు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందీ కరంగా ఉందని త్వరగా గోతులు, గుంటలు పూడ్చాలని ఆ రోడ్డు లో ప్రయాణం చేసే వాహనదారులు కోరుకుంటున్నారు.

# ఎట్టకేలకు రైతుల కష్టాలు తీరాయి

### సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం -ఎమ్మెల్యే రాగమయి దయానంద్




**సత్తుపల్లి/జూలై28(జర్నలిస్ట్ వార్త):** రైతుల మొహంలో చిరునవ్వు చూసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం సీతారామ ప్రాజెక్టు ద్వారా ఎన్టీఆర్ కెనాల్ బేతుపల్లి లిఫ్ట్ వద్ద ఎన్టీఆర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు ఎమ్మెల్యే . దీంతో రైతుల మొహంలో చిరునవ్వులు వెలిగాయి.వేంసూరు మండలంలోని 59 చెరువుల్లో జలకళ సంతరించింది. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహ రావు, చల్లగుల్ల కృష్ణారావు, కమల్ పాషా, సత్తుపల్లి మండలం కిసాన్ అధ్యక్షులు కంచర్ల రమేష్, మాజీ ఎంపీపీ చల్లూరి వెంకటేశ్వరరావు,సత్తుపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణం, సత్తుపల్లి మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మిశెట్టి గణేష్, సత్తుపల్లి మండలం, పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాకర్లపల్లి ప్రజలు పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి నగదు అందజేత

**గణపురం/జులై28(జర్నలిస్ట్ వార్త):** శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి కి శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు ముసునూరు నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణపురం మండల కేంద్రానికి చెందిన కట్టుకూరి రాధిక శ్రీనివాస్ దంపతుల. కుమార్తె అయినా కటకూరి అశ్విని జ్ఞాపకార్థంగాఆలయ అభివృద్ధి కొరకు 10.116 రూపాయలను ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూల శ్రీనివాస్ గౌడ్ బటిక స్వామి దైవాల భద్రయ్య పాండవుల భద్రయ్య మాదాసు అర్జున్ బూర రాజగోపాల్ మాదాసు మొగిలి ఉయ్యాల బిక్షపతి గోరంట్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**తల్లాడ/జూలై28(జర్నలిస్ట్ వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తల్లాడ తాసిల్దార్ సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తల్లాడ తాసిల్దార్ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు



వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో భూభారతికి సంబంధించిన వినతి పత్రాలు అధికంగా వచ్చినట్లు తెలిపారు.



భూభారతి సమస్యలను దశలవారీగా పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క ని కలిసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట/జులై28(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క ని వారి చాంబర్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని నియోజకవర్గాల కంటే నర్సంపేట పై అధిక ప్రేమను చూపాలని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ మరింత పెరిగిందని రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా గ్రామ గ్రామాన ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు మరింత చెరువుగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పరామర్శ



**చెన్నారావుపేట/జులై29(జర్నలిస్ట్ వార్త):** మండలం శంకరం తండా గ్రామంలో దరావత్ దేశ్య అనారోగ్యంతో మరణించగా సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ దేశ్య పార్థీవ దేహానికిపూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరారెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మండల కార్యదర్శి భూక్య మోహన్,నాయక్ మార్కెట్ డైరెక్టర్లు కోరే కుమారస్వామి,చీర అశోక్,మాజీ సర్పంచ్ భద్రు, నాయక్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, ప్రచార కార్యదర్శి మాధారపు చరణ్, మంద యాక య్య ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు హనుమ నాయక్ బాలు నాయక్ రాజేందర్ నాయకులు బొంత శ్రీను కుండే కుమారస్వామి, రాం చంద్రు వెంకన్న,గుగులోత్ రవి,సూర్య,స్వామి, బీమా,రఘు, బండి దిలీప్, బుద్ధు, బిచ్చ తదితరులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసమే వ్యాసరచన పోటీలు

### మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్



**హుజురాబాద్/జూలై28(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలిక్కి తీయడం కోసమే వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ అన్నారు. సోమవారంభారతీయ ప్రతిష్టాత్మక దిగ్గజ సంస్థ టాటా వారి టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింగపూర్, హుజురాబాద్ విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 6 గురు విద్యార్థులను ఎంపిక చేశారు. సీనియర్స్ విభాగంలోమొదటి స్థానం గుండవేని తిరుమల,రెండవ,స్వర్గం తేజస్విని,మూడవ,మిడిదొడ్డి శ్రీవల్లి,జూనియర్స్ విభాగంలోమొదటి స్థానం జోంగోని పూజిత,రెండవ,తిప్పారపు ద్రాక్ష తాయి,మూడవ,ఓల్లాల సాయి తేజగెలుపొందిన విద్యార్థుల కు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు, టిబి ఐ ఆర్గనైజర్ అంజలి , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ నారాయణ హై స్కూల్‌లో మాక్ ఎలక్షన్స్ ఘనవిజయం






**గణపురం/జూలై27(జర్నలిస్ట్ వార్త):** శ్రీ నారాయణ హై స్కూల్‌లో సోమవారం మాక్ ఎలక్షన్స్ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా శాంతియుతంగా నిర్వహించబడ్డాయి. బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరగగా, ఉపాధ్యాయుల సమక్షంలో లెక్కింపు పనులు జాగ్రత్తగా చేపట్టారు.ఈ ఎన్నికల ఫలితాల ప్రకారం, హెడ్ గర్ల్‌గా %ూ%.సాయి సహస్ర, హెడ్ బాయ్‌గా ఏ. అభిరామ్ విజయం సాధించారు. ఎస్ పి ల్ గా ఎన్. వైష్ణవి, డి ఎస్ పి ల్ గా పి. నిశాంత్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శ్రీ నారాయణ హై స్కూల్ చైర్మన్ (శ్రీ ఆదర్శవాణి విద్యాసంస్థల అధినేత) నాగనబోయిన రవి మాట్లాడుతూ,ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నియమశ్రద్ధ, బాధ్యతా భావం పెంపొందించడంలో తోడ్పడతాయి. విజేతలు మిగిలిన విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయన్నారు .ఈ కార్యక్రమంలో డైరెక్టర్/ప్రిన్సిపాల్ శ్రీ శశిధర చారి, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ శ్రీమతి స్వప్న చారి, ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**భూపాలపల్లి/జూలై28(జర్నలిస్ట్ వార్త):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజావాణిలో ప్రజలు 59 దరఖాస్తులను అందచేశారని తెలిపారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కల్లెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, యూరియా కొరత లేదు..

**-పంటకు సరిపడే నిల్వలు అందుబాటులో ఉన్నాయి -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-ఎరువుల సంబంధ ఫిర్యాదులపై టోల్ ఫ్రీ నెం.1077 లకు కాల్ చేయాలి**

**-యూరియా అక్రమ రవాణా జరగకుండా అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన బందోబస్తు చేపట్టాం**

**సింగరేణి మండలం కారేపల్లి సహకార పరపతి సంఘం ఎరువుల విక్రయ కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**





**ఖమ్మంబ్యూరో/జులై28(జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో కావాల్సినంత ఎరువులు అందుబాటులో ఉన్నట్లు, ఎక్కడా ఎరువుల కొరత లేదని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే, అధిక ధరలకు అమ్మకం జరిపితే చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు.సింగరేణి మండలం, కారేపల్లి లోని విశాల సహకార పరపతి సంఘం ఫెర్టిలైజర్స్ సేల్ పాయింట్ కేంద్రంను జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. ప్రతీ రైతుకి ఎన్ని బస్తాలు యూరియా ఇస్తున్నారో పరిశీలించి వారి భూమి వివరములను లెక్క చూశారు. అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు రైతుల పక్షంగా పనిచేస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం పంట వేసిన రైతులకి పంట కు అవసరమైన యూరియా మాత్రమే సరఫరా చేయవలెనని అధికారులను ఆదేశించారు. ఎవరికైనా ఎక్కువ మొత్తంలో యూరియా బస్తాలు పంపిణి చేసినట్లయితే అట్టి సొసైటీ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆగస్టు నెలకు సరిపడా ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, యూరియాకు ఎటువంటి కొరత లేదని, రైతులు అనవసర ఆందోళన చెందవద్దని తెలిపారు. ఆగస్టులో కూడా మనకి యూరియా సరఫరా ఉంటుందని, కాబట్టి రైతులు కావాలసిన దానికంటే ఎక్కువగా యూరియాని ప్రస్తుతం కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాకి కావల్సిన యూరియాను డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికార యంత్రాంగం, ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయిలో మాట్లాడి సరఫరా చేయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఎరువుల లభ్యత ప్రతిరోజు ట్రాక్ చేస్తున్నామని, ప్రస్తుతం 3 వేల మెట్రిక్ టన్నుల పైగా యూరియా అందుబాటులో ఉందని, మరో 2500 మెట్రిక్ టన్నుల యూరియా రెండు రోజులలో జిల్లాకు చేరుకుంటుందని, ఆగస్టు వరకు అవసరాలకు యూరియా సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు నెల అవసరాల కోసం ఖమ్మం జిల్లాకు అదనపు యూరియా అలాట్మెంట్ చేయాలని ప్రభుత్వం ను కోరామని తెలిపారు. ప్రతి సేల్ ఆన్ లైన్ ద్వారా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దులు వద్ద పటిష్టమైన బందోబస్తు, ఎరువులు ప్రక్కదోవ కాకుండా గట్టిగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని వివరించారు.ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత ఉన్నట్లు గమనిస్తే, అధిక ధరలకు అమ్మకం జరిపితే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టరేట్ లో రైతుల సౌకర్యార్థం ఎరువుల ఫిర్యాదు టోల్ ఫ్రీ నెం. 1077 కు ఫిర్యాదు చేయవచ్చున్నారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా సింగరేణి తహసీల్దారు రమేశ్, యంపిడివో రాజేందర్, వ్యవసాయ అధికారులు తదితరులు ఉన్నారు.

# కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో

### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**భూపాలపల్లి/జూలై28 (జర్నలిస్ట్ వార్త):** కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో.., కనీస రాజకీయ అవగాహన లేని వ్యక్తివి నువ్వు మా సి ఎం రేవంత్ సర్కార్ ని దున్నపోతు ప్రభుత్వమంటావా ఖబర్దార్ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు.ఎమ్మెల్యే ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండి వందలాది మంది ఆత్మహత్యలకు కారణమైంది మీ బీఆర్ఎస్ హయంలో కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల మీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది మీరు కాదా అని అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాల భూములను అప్పనంగా కొల్లగొట్టి లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి చేయలేదన్నారు. అదేవిధంగా, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం లాంటి ఎన్నో అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం మీదన్నారు. భారతదేశంలో అబద్ధాలు పుట్టిందే కేసీఆర్, కేటీఆర్ ఇంట్లోనని అన్నారు. తనకు వ్యాపారాలే లేవని మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్న నీ వ్యాపారాల చిట్టా మొత్తం తీసి, పూర్తి వివరాలతో మీడియా ముందుకు త్వరలోనే వస్తానని ఎమ్మెల్యే అన్నారు. మీ పార్టీ(బీఆర్ఎస్) నేతలను, కార్యకర్తలను మేము(కాంగ్రెస్) వేధిస్తున్నామని అంటున్నారు. మీ ప్రభుత్వ పాలనలో మా నాయకులు కోటగిరి సతీష్ గౌడ్, బండ శ్రీకాంత్, కురిమిల్ల శ్రీనివాస్,జోడు ప్రదీప్ ముదిరాజ్ లపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించింది మీరు కాదా అని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ వాళ్లవి ఇసుక ర్యాలీలు జరుగుతున్నాయని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మీ ప్రభుత్వ హయాంలో వడ్డేపల్లి(హన్మకొండ) జీఎంఆర్ కట్టడాలకు ఇసుకను అక్రమంగా మొరంచపల్లి బ్రిడ్జి వద్ద డంప్ చేసి హన్మకొండ, హైదరాబాద్, భూపాలపల్లి కి లారీలల్లో తరలించింది మీరు కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి పదేళ్లు మీరు ఎమ్మెల్యేగా ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, నేను(జీఎస్సార్)ఎమ్మెల్యే గా ఉన్న 18 నెలల్లోనే ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తున్నందుకు అసూయ, ఈర్ష్య, కండ్లమంటతో తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాల పైన నా ఫోటోలు పెడితే, స్మశానవాటికల్లో సమాధుల పైన ఫోటోలు పెట్టుకున్నట్లు.. అని మాజీ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు సరైనది కాదన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు నాలుగైదు వందల కోట్ల అభివృద్ధి పనులు చేశానని, అవన్నీ పనులు త్వరలోనే పూర్తవుతాయని, ఆ పనులు పూర్తి కాకపోతే వచ్చే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేయనని ఎమ్మెల్యే అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు తప్పుడు మాటలు మానుకుంటే బాగుంటుంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పి, గుండు సున్నా వేసి విశ్రాంతినిచ్చారు. ఇప్పుడు త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూడా ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరని, ఆ ఎన్నికల్లో కూడా ప్రజలు మీకు పెద్ద గుండు సున్నా వేస్తారని ఎమ్మెల్యే అన్నారు.

# ఖమ్మం జిల్లాలో కె జి బి వి టెండర్లు ప్రైవెట్ సిండికేట్లకు, కార్పొరేట్ సిండికేట్లకు అప్పజెప్పే కుట్ర విరమించుకోవాలి

**అంతుపొంతులేని నిబంధనలతో స్థానిక,చిరు కాంట్రాక్టులు అన్యాయం చేయ్యద్దు.**

**కొత్త నిబంధనలతో విద్యార్థులపై ఆహర ప్రయోగాలు విరమించుకోవాలని భీమ్ వారియర్స్ ఆధ్వర్యంలో సోమవారం**

**ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి.. భీమ్ వారియర్స్,**

**గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు సంఘం ప్రెసిడెంట్ నారపోగు ఉదయ్**





**ఖమ్మం బ్యూరో/జూలై28(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం ఐ డి ఓ సి లో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి గురుకులాల్లో ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు వ్యవస్థని పక్కనపెట్టి ప్రైవేటు, కార్పొరేట్ సిండికేట్లకు ఇచ్చే క్రమంలో చిరు కాంట్రాక్టర్లకు, నిరుద్యోగులకు అన్యాయం చేయకుండా న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ ,బిసి,మైనారిటీ,జనరల్ గురుకులాలు కేజీబీవీ విద్యాసంస్థల్లోని పాత కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ప్రవేట్ సిండికేట్లకు,కార్పొరేట్ సిండికేట్లకు అప్పజెప్పే కుట్ర జరుగుతున్న నేపథ్యంలో చిరు కాంట్రాక్టులు, నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగే పరిస్థితి ఉందని,ఇప్పటివరకు ఒక్కొక్క విద్యాసంస్థల్లో ఐదు నుంచి ఏడు కాంట్రాక్టర్లు ద్వారా నిరుద్యోగులు, చిన్న అక్కడున్న విద్యార్థులతోని సిబ్బందితోనే సమన్వయం చేసుకుంటూ సర్వీసు ఇస్తున్నారు అనేక ఇబ్బందులు పడుతూ తమ ఇంట్లో బంగారం తాకట్టు పెట్టుకొని బ్యాంకు రుణాలు పొంది బిల్లులు సకాలంలో రాకపోయినా సర్వీస్ ఇవ్వడంలో ఏమాత్రం కూడా ఈ వెనకడు వేయకుండా ప్రస్తుత కాంట్రాక్టర్లు పనిచేశారు కానీ ఇప్పుడున్న కాంట్రాక్టు వ్యవస్థని పక్కనపెట్టి ప్రైవేట్, కార్పొరేట్ సిండికేట్లకు ఇవ్వడం అనేది వారి నోట్లో మట్టి కొట్టడమే కాకుండా పిల్లల్ని కూడా గందరగోళంలో పడేసే పరిస్థితి ఉంటుంది కాబట్టి ప్రభుత్వం చిరు కాంట్రాక్టర్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని భీమ్ వారి ఆధ్వర్యంలోని ఎడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది

ఈ కార్యక్రమంలోని బీమ్ వారియర్స్ ఉదయ్ వారియర్ ,వెంకటేష్ , నాగేశ్వరరావుగారు, లాలయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు

# కార్పొరేట్ కబంధహస్తాలలో చిక్కుకున్న చదువు

## విప్లవ చిత్రాల దర్శక, నిర్మాత, నటుడు ఆర్ నారాయణ మూర్తి

### విద్యార్థి నాయకులతో కలిసి యూనివర్సిటీ సినిమా వాల్ పోస్టర్ల విడుదల





**హనుమకొండ/జూలై 28(జర్నలిస్ట్ వార్త):**కార్పొరేట్ కబంధ హస్తాల చదవు చిక్కుకున్నదని, చదువుకునే రోజుల నుండి చదువు కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయని విప్లవ చిత్రాల దర్శక, నిర్మాత, నటుడు ఆర్. నారాయణ మూర్తి అన్నారు. వర్సిటీ పేపర్ లీకేజ్, ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్నేహ చిత్ర పిక్చర్స్ లో తెరకెక్కిన సినిమా యూనివర్సిటీ పేపర్ లీకేజ్ సినిమా వాల్ పోస్టర్ లను హనుమకొండ లోని ప్రెస్ క్లబ్ లో సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నారాయణ మూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు ఎక్కడ చూసినా పేపర్ లీకేజ్ అనేది సర్వసాధారణంగా మారిందని, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీక్ అవ్వడం, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల పరీక్ష పత్రాలు లీక్ అవ్వడం అంటే ఈ సమాజాన్ని నాశనం చేయడమే అని అన్నారు. కార్పొరేట్ కబంధహస్తాలలో ఈరోజు విద్య ఇరుక్కొని పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని మండిపడ్డారు. తన సినిమాని ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు, నిరుద్యోగులు విద్యార్థులు అధిక సంఖ్యలో చూసి విజయవంతం చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయి మాట్లాడుతూ కలామ తల్లి ముద్దుబిడ్డ నారాయణ మూర్తి సామాజిక అసమానతలపై, విద్య, వైద్యం, క్లాసిఫికేషన్, క్యాస్టిఫికేషన్ అంశాలపై తన జీవితాన్ని సినిమా రంగానికి అంకితం చేసి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సినిమా రూపంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెండితెరపై దశాబ్దాలుగా మన జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం చదువుకునే రోజుల నుండి చదువు కొనుక్కునే పరిస్థితులను వివరిస్తూ వారు చిత్రాన్ని రూపొందించడం జరిగిందని, ఇది కేవలం సినిమా మాత్రమే కాదని, విద్యార్థుల జీవన పరిణామ క్రమంలో వర్సిటీలోఎదురయ్యే సమస్యలను కళ్ళ కట్టినట్లు ఈ సినిమాలో చూపించడం జరిగిందని తెలిపారు. ఆగష్టు 21న విడుదల అయ్యే యూనివర్సిటీ చిత్రాన్ని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు సినిమాను ఆదరించి వీక్షించి ప్రమోట్ చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు, సిపతి వినయ్,పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, పిడిఎస్ యు యూనివర్సిటీ అధ్యక్షుడు విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు వినయ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం

### గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్,: గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పు కొచ్చారు. హైదరాబాద్‌లో ఇవా(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు- చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ఎ÷-లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు.అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కోదండ రామాలయంలో ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం



**నర్సంపేట/జూలై28(జర్నలిస్ట్ వార్త):**శ్రీ కోదండ రామాలయంలో ధర్మాచార్య చల్లా వెంకట్ రెడ్డి శోభారాణి దంపతులు ఆలయ కమిటీ చైర్మన్ జినుకల సురేష్ ఆధ్వర్యంలో సోమవారం వికాస తరంగిణి. సౌజన్యముతో శ్రీ నీలా దేవి ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం పురోహితులు ఎస్పీ. శ్రీనివాస స్వామి, రంగనాధ స్వామి, కృష్ణ చైతన్య వార్ల మధ్య విశ్వక్సెన ఆరాధన గోదా అమ్మవారికి పంచామృత అభిషేకం, విశేష వస్త్ర అలంకరణ తొపాటు వచ్చిన భక్తుల అందరికి అర్చన చేశారు, అశోక నగర్ మహిళ భక్తులు విటి సభ్యులు వడిబియ్యం సమర్పించారు, వికాస తరంగిణి సభ్యులు మహిళలు తోలుత శ్రీ విష్ణు, లక్ష్మి, శ్రీకృష్ణా, రంగనాధ శ్రీ గోదా నీలా దేవి శత నామార్చన, ముప్పది తిరుప్పావై పాశురాలు అనుసంధించారు, ఆనంతరం ఆలయము చుట్టూ శ్రీ గోదాదేవి పల్లకి సేవ మహిళలు విటి సభ్యులచే ఉయ్యాల జంపాల పాటలతో కనుల విందుగా చేశారు, ఆనంతరం తీర్థ ఘోస్థి తొ కార్యక్రమం సుసంపన్నం ఐనది ఇట్టి వేడుకలకు అశోక నగర్ గ్రామస్థులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు

# చెస్ క్వీన్ దివ్య

**జులై28(జర్నలిస్ట్ వార్త):**

%ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన యువ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ విజేతగా నిలిచింది. భారత్‌కే చెందిన తెలుగుతేజం కోనేరు హంపితో జరిగిన ఫైనల్లో దివ్య 1.5, 0.5 పాయింట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. సోమవారం టైబ్రేకర్‌లో దివ్య జయభేరి మోగించింది. ఇద్దరి మధ్య జరిగిన తొలి రెండు రౌండ్‌లు డ్రాగా ముగిసాయి. దీంతో ఫలితం కోసం టైబ్రేకర్ అనివార్యమైంది. ఇందులో అసాధారణ ఆటను కనబరిచిన మహారాష్ట్ర సంచలనం దివ్య చారిత్రక విజయాన్ని అందుకుంది. తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా, రెండో టైబ్రేకర్‌లో దివ్య 75 ఎత్తుల్లో సీనియర్ క్రీడాకారిణి కోనేరు హంపిని ఓడించింది.

భారత్ మహిళల ఫిడె ప్రపంచ చెస్ టైటిల్‌ను గెలువడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లు ఫైనల్‌కు చేరడంతో భారత్‌కు ప్రపంచ చెస్ కిరీటం ముందే ఖాయమైంది. అయితే ఫైనల్లో చిరస్మరణీయ ప్రతిభను కనబరిచిన మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరానికి చెందిన 19 ఏళ్ల దివ్య జార్జియా వేదికగా జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అసాధారణ ఆటతో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు ఫైనల్లో గెలిచి టైటిల్ సాధించాలని భావించిన భారత చెస్ స్టార్ హంపికి నిరాశే మిగిలింది. తుది పోరులో హంపి అసాధారణ ఆటను కనబరిచినా ఫలితం లేకుండా పోయింది. చివరి వరకు నిలకడైన ఆటతో అలరించిన దివ్య ప్రపంచ టైటిల్‌ను సొంతం చేసుకుంది.



**అంచనాలు లేకుండానే..**

బాటుమిలో జరిగిన మహిళల చెస్ ప్రపంచ కప్‌లో దివ్య ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌కు ముందు దివ్య సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువే. అంతేగాక టోర్నీ ఫైనల్స్‌కు ముందు దివ్యకు గ్రాండ్ మాస్టర్ హోదా కూడా లేదు. మాస్టర్ హోదాతోనే దివ్యవిశ్వకప్ బరిలోకి దిగింది. ఈ పరిస్థితుల్లో దివ్య విశ్వవిజేతగా నిలుస్తుందని ఎవరూ ఊహించలేదు. హంపితో సహా ప్రపంచంలోని దిగ్గజ గ్రాండ్ మాస్టర్లు బరిలో ఉండడంతో వీరిలో ఎవరో ఒకరు టైటిల్ సాధిస్తారని అందదూ ఊహించారు.

కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ భారత్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ విశ్వవిజేతగా నిలవడం విశేషం. ప్రపంచ చెస్ టైటిల్‌తో దివ్య సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంతకుముందు ప్రపంచ మహిళల చెస్‌లో భారత్ ఒక్కసారి కూడా ఫైనల్‌కు చేరలేదు. ఈ టోర్నీలో దివ్య ఫైనల్‌కు చేరి ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా సరికొత్త రికార్డు నెలకొల్పింది. హంపి కూడా సెమీస్‌లో గెలిచి దివ్య సరసన నిలిచింది. తాజాగా ఫైనల్లో దివ్య తన కంటే ఎంతో సీనియర్ అయిన హంపిని మట్టికరిపించి ఔరా అనిపించింది. ఈ టైటిల్‌తో దివ్య భారత మహిళల చెస్‌లో సరికొత్త ఆధ్యాయానికి తెరలేపిందనే చెప్పాలి.

## అక్షరాన్ని ఆయుధంగా చేసుకోవాలి

### సోషల్ వర్కర్ లతీఫ్




**వైరా/జులై28(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు అక్షరాన్ని ఆయుధంగా మలుచుకోవాలని సోషల్ వర్కర్ లతీఫ్ అన్నారు. వైరా మండలం సిరిపురం కేజీ గ్రామంలో సోషల్ వర్కర్. లతీఫ్ .ఆధ్వర్యంలో సోమవారం మానవసేవే మాధవ సేవగా భావించి తనకున్న దానిలో పరోపకారం చేయటంలో ముందుండేటటువంటి వ్యక్తి అందరికీ సుపరిచితుడు షేక్ లతీఫ్. వైరా మండలం ముసలమడుగు. ఎంపీ. యుపి. పాఠశాలను. సందర్శించి పిల్లలు చదవాలి , పిల్లలు ఎదగాలి అనే అటువంటి సదుద్దేశంతో ఇక్కడ చదువుతున్న 24. మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 నోటు పుస్తకాలు. పెన్నులు అందించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు . షర్మిల ఉషారాణి . సత్తనపల్లి.నరసింహారావు .సిహెచ్ శ్రీనివాస్ . షేక్ సైదా కండక్టర్ . షేక్ .పీర్సాహెబ్ .సావిత్రి .తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పించాలని ఎమ్మెల్సీ కవిత కు వినతి



**నర్సంపేట/జూలై28(జర్నలిస్ట్ వార్త):** గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో వున్న ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపు చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కు సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేట. ప్రైవేటు కళాశాల యాజమాన్యం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ పాత బాకీలు ఏప్రిల్ నుండి ఇస్తున్న మాట .ఉత్తిది అయినది అని తెలిపారు. రైతులు ఆత్మహత్యలు తో పాటు కళాశాల యాజమాన్యాలు బకాయిలు రాకపోతే యాజమాన్యాలకు ఆత్మహత్యలు తప్పవని వారికి వివరించారు. కవితా స్పందించి. తప్పక ముఖ్యమంత్రితో చర్చించి . మీకు న్యాయం చేస్తానని వారు మాట ఇచ్చినారు. ఈ కార్యక్రమం ల్లో యాజమాన్యం జీజుల సాగర్. తిరుపతి. గుంటక రాజ్కుమార్. గూగులోతు యాకుబ్.రాజ్ కుమార్. అనిల్. మాతంగి.తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ




**రాయపర్తి/జులై28(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గంగిశెట్టి వెంకటయ్య ఆనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.మండల పార్టీ ఉపాధ్యక్షులు భూక్య సమ్మయ్య,మాజీ సర్పంచ్ లేతకుల యాదవ రెడ్డి,ఉల్లెంగుల నర్సయ్య,చిర్ర మల్లయ్య,తుమ్మ భూపాల్ రెడ్డి,పరుపాటి రాజిరెడ్డి, పగిడిపల్లి భీమారెడ్డి,బొమ్మినేని రాజన్న,కోలా అనిల్,చిర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ



**రాయపర్తి/జులై28(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని బురహాన్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూర బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం ఆయన చిత్రపటానికి మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళ్లు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ ను పంపిణి చేసి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజి జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,బద్దం వేణుగోపాల్ రెడ్డి,గజవెల్లి ప్రసాద్,రవీందర్,గొల్లపల్లి రమేష్,బాబు రెడ్డి,చందు రాము యాదవ్,కిషన్,సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.